క్లుప్తంగా

వర్సిటీ టాపర్స్‌కు వీసీ అభినందన



విద్యార్థినులను అభిందిస్తున్న ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి

విజయనగరం అర్బన్‌: ఆంధ్రయూనివర్సిటీ పరిధిలో డిగ్రీ వార్షిక పరీక్ష–2024 ఫలితాల్లో బీబీఏ కోర్సులో టాపర్స్‌గా నిలిచిన సత్య డిగ్రీ అండ్‌ పీజీ కళాశాల విద్యార్థినులు కె.రమ్య, టి.ఊర్మిళాదేవిని వర్సిటీ వీసీ పీవీజీడీ ప్రసాద్‌ రెడ్డి అభినందించారు. విద్యార్థినులు శనివారం ఆయన్ను విశాఖపట్నంలోని ఆయన ఛాంబర్‌లో కలిశారు. వీసీని కలిసిన వారిలో కళాశాల డైరెక్టర్‌ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎంవీ సాయిదేవిమణి, మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌ విభాగం హెడ్‌ డాక్టర్‌ ఎస్‌.వరూధిని, టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులు ఉన్నారు.

ఖగోళశాస్త్రంపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్‌ మహేశ్‌

డెంకాడ: మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఖగోళ శాస్త్రంపై లైబ్రేరియన్‌ మహేశ్‌ అవగాహన కల్పించారు. పాలపుంత, గెలాక్సీ, సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు, తదితర వాటి మధ్య తేడాలను విద్యార్థులకు వివరించారు. భూమిపై ఉన్నట్టే ఇతర గ్రహాలపై జీవరాశి మనుగడకు అవసరమైన వాతావరణం ఉందా లేదా అని తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఆయా అంశాలను విన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ముద్దూరు పంచాయతీ పరిధిలోని తమటాడ గ్రామంలో నిర్మించిన సిమెంట్‌ రోడ్లను ఎంపీడీఓ ఎస్‌.హరిహరరావు, పంచాయతీరాజ్‌ జేఈఈ కె.కృష్ణమూర్తి శనివారం పరిశీలించారు. మండల పరిషత్‌, గడపగడపకూ మన ప్రభుత్వంతో పాటు,పంచాయతీ నిధులతో ఈ రోడ్లు నిర్మించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అని పరీక్షించారు.

దొంగలతో బెంబేలు

మెరకముడిదాం: మండలంలోని భీమవరం, సోమలింగాపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్‌ చేయడంతో రెండు గ్రామాల ప్రజలతో పాటు మండలవాసులు బెంబేలెత్తి పోతున్నారు. భీమవరంలో రెండు, మూడు ఇళ్లలోకి దొంగలు వెళ్లేందుకు ప్రయత్నించగా స్థానికులు అప్రమత్తమవ్వడంతో దొంగలు పరారయ్యారని గ్రామస్తులు చెబుతున్నారు. సోమ లింగాపురంలో కూడా శుక్రవారం రాత్రి దొంగలు గ్రామసచివాలయం వద్ద సంచరిస్తున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే దొంగలు పలాయనం చిత్తగించారు. బుదరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు సిబ్బందితో కలిసి సోమలింగాపురం, భీమవరం గ్రామాల్లో పహారా కాశారు. ఈ రెండు గ్రామాల్లో దొంగలు పడ్డారనే సమాచారం తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని గ్రామాల్లో రాత్రి వేళల్లో యువకులు గస్తీ కాస్తున్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

వేపాడ: బడి ఈడు పిల్లలు బడుల్లోనే ఉండాలని, దుకాణాల్లో వారిని పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ బాలభాస్కరరావు, ఎంపీడీఓ నిశ్చల అన్నారు. వేపాడలోని పలు దుకాణాలను పోలీసులు, ఎమ్మార్సీ సిబ్బందితో కలిసి శనివారం సందర్శించారు. దుకాణాల్లో ఎవరైనా బడిఈడు పిల్లలు పనిచేస్తున్నారా అని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు పనుల్లో పెట్టవద్దని, బడికి పంపించాలని సూచించారు. బడిబయట ఉన్న పిల్లల గుర్తింపు సర్వే అన్ని గ్రామాల్లో చేపడుతున్నామని ఎంఈఓ చెప్పారు.

ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ

- ఎక్కడ చూసినా అభ్యర్థుల గెలుపోటములపైనే చర్చ
- భారీగా బెట్టింగ్‌లు
- 4న కౌంటింగ్‌
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం



లెండీ ఇంజినీరింగ్‌ కాలేజీలో ఎన్నికల కౌంటింగ్‌ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కలెక్టర్‌, అధికారులు

పూసపాటిరేగ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ పెరుగుతోంది. పట్టణాలు, పల్లెల్లో ఎక్కడ చూసినా కౌంటింగ్‌పైనే చర్చ. ఇద్దరు ఒక చోట కలిస్తే చాలు విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపైనే జోరుగా విశ్లేషణలు సాగుతున్నాయి. దీంతో పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములపై భారీగా బెట్టింగ్‌ జరుగుతోంది. మరో రెండు రోజుల్లో (4వ తేదీన) అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు డెంకాడ మండలం జొన్నాడ సమీపంలో ఉన్న లెండీ ఇంజినీరింగ్‌ కళాశాలలో అధికారులు కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ 2019 ఏప్రిల్‌ 11న జరిగితే ఫలితాలు కోసం 41 రోజుల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. ఈసారి కేవలం 21 రోజుల్లో ఫలితాలు వెలువడనున్నాయి.

కౌంట్‌డౌన్‌ ప్రారంభం

ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్‌ ప్రారంభం అయింది. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలవుతుంది. ఫలితాలపై అటు అభ్యర్థులతో పాటు ఇటు ప్రజల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 248 పోలింగ్‌ బూత్‌లలో లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాట్లు చేశారు. పోస్టల్‌ బ్యాలెట్ల లెక్కింపునకు మరో మూడు టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 18 రౌండ్లలో లెక్కింపు పూర్తికానుంది. ఒక్కో రౌండ్‌ లెక్కింపు దాదాపు గంటలోపే ముగిసే అవకాశం ఉంది. ముందుగా పోస్టల్‌ బ్యాలెట్లు ఫలితాలు వెల్లడిస్తారు. నియోజకవర్గంలో 1,88,456 ఓట్లు పోలయ్యాయి. 2121 పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లు పోలయ్యాయి. పోలింగ్‌ సరళిని బట్టి పోటీలో ఉన్న అధికార, విపక్షాల అభ్యర్థులు తమ అనుచరులుతో కలిసి గ్రామాలు, వార్డుల వారీగా తమకు వచ్చే ఓట్లపై లెక్కలు వేసుకుంటున్నారు. ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తున్న కొద్దీ వారిలో ఉత్కంఠ పెరుగుతోంది. మరో పక్క కౌంటింగ్‌ రోజు సమీపించడం, కేవలం గంటల వ్యవధే ఉండటంతో ఫలితాలు కోసం అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ పథకాలపై సంతృప్తి

2019 ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు గాను 151 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసింది. నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడు విజయం సాధించారు. ఐదేళ్ల పాటు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతీ గడపను తట్టాయి. సంక్షేమ పథకాలు పొందిన పేద, మధ్య తరగతి ప్రజలు తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారు. మే 13న జరిగిన పోలింగ్‌లో ఆపార్టీ అభ్యర్థులకే పట్టం కట్టినట్లు పోలింగ్‌ సరళిని చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా మహిళా ఓటర్లు ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ పాలన అందించిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళలే న్యాయ నిర్ణేతలు



రీమాపేట పోలింగ్‌ కేంద్రంలో ఓటు వేసేందుకు రాత్రి 7 గంటల సమయంలో క్యూలో నిలుచున్న మహిళలు (ఫైల్‌)

- అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించేంది మహిళా ఓటర్లే..
- నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళలే అధికం
- వారంతా ప్రభుత్వానికి సానుకూలం

విజయనగరం రూరల్‌: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించేది మహిళా ఓటర్లే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మహిళల పేరుపైనే అనేక సంక్షేమ పథకాలు అందించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మీకు లబ్ధి జరిగితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండని' ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు మే 13న జరిగిన పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొని వైఎస్సార్‌ సీపీకి మద్దతుగా నిలిచారు. ఈ ఏడాది ఓటింగ్‌ శాతం పెరగడం, వృద్ధులు, మహిళా ఓటర్లు అధికంగా ఓటింగ్‌లో పాల్గొనడం వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు భావిస్తుండగా.. టీడీపీ కూటమి అభ్యర్థుల్లో ఆందోళన కనిపిస్తోంది. నియోజకవర్గంలో మొత్తం 2,57,205 మంది ఓటర్లు ఉండగా.. అందులో మహిళలు 1,32,347 మంది, పురుషులు 1,24,829 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 7,518 మంది అధికంగా ఉండటం గమనార్హం.

పోలైన మహిళల ఓట్లు 94,894

గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో 94,894 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే 5008 మంది ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొనడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు గెలుపుపై మరింత ధీమా పెరిగింది. దీంతో పాటు పలు సర్వేలు సైతం వైఎస్సార్‌సీపీ గెలుపుపై అనుకూలంగా చెప్పడంతో ఆపార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువిరుస్తున్నాయి.

అక్కచెల్లెమ్మల సంక్షేమమే వైఎస్‌ జగన్‌ అజెండా

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో అధికారం చేపట్టిన నాటి నుంచి అక్కచెల్లెమ్మల సంక్షేమమే అజెండాగా ఐదేళ్ల పాలన సాగించారు. అమ్మఒడి, జగనన్న గృహ నిర్మాణ పథకం, వైఎస్సార్‌ చేయూత, వైఎస్సార్‌ ఆసరా, వైఎస్సార్‌ కాపునేస్తం, జగనన్న తోడు, వైఎస్సార్‌ పావలా వడ్డీ పథకం, డ్వాక్రా సంఘాల రుణమాఫీ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అక్కచెల్లెమ్మలకు అందించి వారికి ఆర్థిక భరోసా కల్పించారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై వారంత సానుకూలంగా ఉన్నారు. ఈ నెల 4న ప్రకటించనున్న ఎన్నికల ఫలితాల్లో మహిళా ఓట్లే కీలకం కానున్నాయి. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవడంతో గెలుపు నల్లేరుమీద నడకే అని విశ్లేషకులు అంటున్నారు.

సరైన జీవనశైలితో ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్‌ బ్రహ్మారెడ్డి

విజయనగరం అర్బన్‌: మంచి జీవనశైలి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్‌ వెన్నపూస బ్రహ్మారెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం స్థానిక కంటోన్మెంట్‌ గురజాడ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటిస్తే చాలా వరకు రోగాలకు దూరంగా ఉండవచ్చని, మనం తినే ఆహారంపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేదిక జాతీయ సలహాదారు డాక్టర్‌ ఎంవీఆర్‌ కృష్ణాజీ, రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌ నాయక్‌, జాతీయ విద్యావిభాగం నాయకులు డాక్టర్‌ ఏవీ రాజశేఖర్‌, రాష్ట్ర నాయకులు గంధ్రేటి అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి శాంతకుమారి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం నాయకులు గంధ్రేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూనియర్‌ కళాశాల ప్రారంభం

జామి: మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జూనియర్‌ కళాశాలను(ఉన్నత పాఠశాలలో) డిప్యూటీ డీఈఓ రమణ శనివారం ప్రారంభించారు. కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఈ విద్యాసంవత్సరం ప్రవేశాలు కల్పిస్తున్నామని ఎంఈఓ గంగరాజు, హెచ్‌ఎం అబ్దుల్‌ రెహమాన్‌ తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

విజయనగరం పూల్‌బాగ్‌: ఆర్టీసీ విజయనగరం జోనల్‌ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్‌ డిమాండ్‌ చేశారు. యూనియన్‌ గౌరవాధ్యక్షుడు ఎ.జగన్మోహనరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు ప్రభుత్వ సంస్థ అయినా సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, ఏప్రిల్‌ నెల వేతనం నేటికీ అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సకాలంలో జీతాలు చెల్లించమని అడుగుతున్న కార్మికులపై వర్క్‌ మేనేజర్లు, డీపీటీవోలు, డీఎంలు వేధింపులకు దిగుతున్నారని, ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. విజయనగరం జోనల్‌ వర్క్‌షాప్‌ మేనేజర్‌ వెంటనే స్పందించి కార్మికులకు ఏప్రిల్‌, మే నెల వేతనాలు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే కాంట్రాక్టర్‌ నుంచి కార్మికులకు రావలసిన బకాయిలను ఇప్పించాలని కోరారు.

కార్మికులను బలిచేయొద్దు


- జిందాల్‌ కార్మికులకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముడిసరుకు సమకూర్చుకునే బాధ్యత యాజమాన్యందేనని.. ముడిసరుకు లేదని జిందాల్‌ స్టెయిన్‌లెస్‌ స్టీల్‌ కర్మాగారం ప్రతినిధులు లేఆఫ్‌ ప్రకటించడం సరికాదని ఎస్‌.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మొండి వైఖరిని విడనాడి కార్మికులపై సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులకు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిందాల్‌ సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించామన్నారు. కర్మాగార మనుగడకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. యాజమాన్యం శాశ్వత, కాంట్రాక్టు కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కర్మాగార యాజమాన్య ప్రతినిధులు దినేష్‌శర్మ, గోపాలకృష్ణతో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు నెక్కల నాయుడుబాబు, పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, పప్పల బంగారునాయుడు, భీమయ్య, లగుడు వామాలు తదితరుల సమక్షంలో ఎమ్మెల్యే చర్చలు జరిపారు. ప్రస్తుతం కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికుల్లో 70 శాతం మంది 55 సంవత్సరాలకు పైబడిన వారే ఉన్నారని, వారిని ఇప్పుడు వేరే రాష్ట్రంలోని మరో యూనిట్‌లోకి పనికి వెళ్లమనడం సరికాదన్నారు. ఒకటి రెండు రోజుల్లో కార్మికులకు మేలుజరిగేలా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, కొత్తవలస, అప్పన్నపాలెం సర్పంచ్‌లు మచ్చ రామస్వామి, కోన దేముడు, వైఎస్సార్‌ సీపీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, సింగంపల్లి గణేష్‌, తదితరులు పాల్గొన్నారు.

జై వీరాంజనేయ



విజయనగరం టౌన్‌: అభయాంజనేయస్వామికి హారతిస్తున్న అర్చకులు



విజయనగరం రూరల్‌: హనుమాన్‌ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



విజయనగరం టౌన్‌: పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి దంపతులు

- ఘనంగా హనుమాన్‌ జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



విజయనగరం టౌన్‌: స్వామివారికి నైవేద్యంగా పెట్టిన 45 రకాల స్వీట్లు



పంచముఖ ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం



లక్ష తమలపాకుల పూజలో పాల్గొన్న భక్తులు

విజయనగరం టౌన్‌: హనుమాన్‌ జయంతిని పురస్కరించుకుని వాడవాడలా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో, శ్రీరామాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సిటీ బస్టాండ్‌ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష సింధూరార్చన చేశారు. అనంతరం స్వామివారికి విశేష హారతినిచ్చారు. స్థానిక పెద్ద ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ ఈఓ వంశీలక్ష్మి ఆధ్వర్యంలో విశిష్ట పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వాసవీ ఫౌండేషన్‌ 45 రకాల స్వీట్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. శంకరమఠంలో శ్రీరామసేవా సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 30మంది భక్తులు సుందరకాండ పారాయణం చేశారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న కోలగట్ల

విజయనగరం టౌన్‌: ఆరోగ్య ప్రదాత, శక్తి స్వరూపుడు అభయాంజనేయస్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని కోరుకున్నట్లు డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. హనుమాన్‌ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పంచముఖ ఆంజనేయస్వామిని శనివారం సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన కమిటీ సభ్యులు ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

రామనారాయణంలో..

విజయనగరం రూరల్‌: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో హనుమాన్‌ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీఎస్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు శ్రీహర్ష, మధు, తేజాలు శాస్త్రోక్తంగా స్వామికి పంచామృతాభిషేకాలు, స్నపనం, సింధూరంతో సహస్ర నామార్చనలు, లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్‌ ట్రస్టీలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వివిధ రకాల వంటకాల నైవేద్యాలు

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్‌ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. సీహెచ్‌ అగ్రహారం, పూసపాటిరేగ, గొల్లపేట, రెల్లివలస, గైతుల చోడవరం తో పాటు పలు గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

జామి: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు పిలుపునిచ్చారు. మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో కలిసి మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాల మధ్య మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. మలేరియా ప్రభావిత పీహెచ్‌సీలు కొట్టాం, పి.ఎం.పాలెం, మెంటాడ ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా మలేరియా అధికారి వై.మణి, జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్‌.సామ్రాజ్యలక్ష్మి, ఎపిడిమియాలజిస్ట్‌ వెంకటేష్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ ఎస్‌.అనిల్‌ప్రేమ్‌కుమార్‌, సీహెచ్‌ఓ ఫ్లారెన్స్‌, హెచ్‌.వి.భవానీ పాల్గొన్నారు.